

# బోసుబాబు కథ

*

గుత్తుల భాస్కర రావు

ఊరంతా తిరిగాను. ఎక్కడా పది నోటికి చిల్లర దొరకలేదు. ప్రతిచోటా చిల్లర కరువే. హోటళ్ళలో 'చిల్లర తెచ్చుకోవలెను' అని లడ్డూలంత అక్షరాల్తో బోర్డులు కట్టేశారు. చివరకి ఒక తవుడు షాపులోకి వెళ్ళి "పది రూపాయల చిల్లర వుంటే యివ్వండి ప్లీజ్" అని అడిగాను. "ఒక కేజీ తవుడు కొనండి, యిస్తాను చిల్లర" అన్నాడతను. నాకు ఒళ్ళు మండింది. తవుడు తీసు కెళ్ళి నేను తినాలిక. యిక అదే అడగాలనుకున్నాను. కానీ అవసరం నాది. నా వాలకం కనిపెట్టి "చూడండి సార్. ఏమీ కొనందే చిల్లర ఎవరిస్తారు?" అన్నాడు కమ్మర్షియల్‌గా నవ్వుతూ. నాకూ నవ్వొచ్చింది. నవ్వుతోబాటు బోసుబాబుకథ కూడా గుర్తొచ్చింది. అదేమనగా....

అనగనగా బోసుబాబు అని ఉండేవాడు. అంతకు ముందు అతను చాలా మంచివాడు. బుద్ధిమంతుడు, గుణవంతుడు. రోడ్డుకెప్పుడూ ఎడంవైపే నడిచేవాడు. సినిమా ఆఖర్న జనగణమన మోగేంత వరకూ నిశ్శబ్దంగా నిలబడేవాడు. బస్సుల దగ్గిరా రైల్వేస్టేషన్ల దగ్గిరా యిలా అడ్డమైన బుకింగుల దగ్గర క్యూ తప్పనిసరిగా పాటించేవాడు. అంతెందుకు తను చెడ్డ పనులు చేసేవాడు కాడు. చెడు వినడంగానీ చూడ్డంగానీ తటస్థిస్తే ముక్కుమీద వేలేసుకునేవాడు.

అటువంటి బోసుబాబు చెడిపోయాడని ఎవరన్నా అంటే లాగి లెంప పగలెయ్యాలనిపిస్తుందిగానీ, ఏమిటి, ఎలా చెడిపోయ్యాడు అని కనీసం ఎంక్వైరీ చెయ్యాలనిపించేదికాదు.

ఇలాగే ఒకనాడు సుబ్బారావు బోసుబాబు గురించి చెడుగా చెబుతుంటే "ఏం కూసావ్‌రా?" అన్నాను కోపంగా. వాడిమీద నా నమ్మకానికి సుబ్బారావు తెల్లబోయాడు. "నిజం బ్రదర్. నా కళ్ళతో చూశాను" అన్నాడు సుబ్బారావు. నేను నమ్మలేదు. "ఒట్టు. నీకూ చూపిస్తా. నడు" అని నన్ను అక్కడికి తీసుకెళ్ళాడు.

అది ఊళ్ళోకెల్లా పెద్ద బ్రాందీ షాపు. దాన్లో బార్ కూడా ఉంది. ప్రొహిబిషన్ తీసివేయక ముందు దాన్లో ఖద్దరు షాపు ఉండేది. 'యిక్కడేరా' అని సుబ్బారావు

నా చెయ్యి పట్టుకుని ముందుకి లాగాడు. కౌంటర్‌లో కూర్చున్నయజమాని మమ్మల్ని చూసి సాదరంగా నవ్వుతూ లోపలికి తీసు కెళ్ళాడు "ఏం పుచ్చుకుంటారు సార్?" అని అడిగాడు తళతళ మెరిసే అద్దాల బీర్వాల్లో వందలకొద్దీ రంగులేబిల్ సీసాలు నిండి ఉన్నాయి మేనేజర్ మా ముందు వంగుతున్నాడు వణుకుతున్నాడు మేమేమీ పుచ్చుకోమని తెలిస్తే యింత శ్రమపడే వాడు కాడు లోపల వరసగా కంపార్ట్ మెంట్స్ ఉన్నాయి ఒక గది ముందు నిల బడి "యిందులోనే" అన్నాడు సుబ్బారావు మేనేజర్ ఆ గది ఖాళీ లేదు అని మొత్తు కుంటున్నాసరే యిద్దరం లోపలికి ఉరికాం. "చూడరా" అన్నాడు సుబ్బారావు.

అంతే! నా కళ్ళను నమ్మి చావలేక పోయాను అద్దంలాంటి సన్ గ్లాస్ టేబిల్ మీద రెండు పొడుగాటి సీసాలు నాలుగు పొట్టి గ్లాసుల మధ్య ముత్యంలాంటి బోసు బాబు మొహం వాలిపోయి ఉంది ఒళ్ళంతా స్టీమ్ యింజన్‌లా సెగలు కక్కుతున్న ట్టుంది ఉన్నట్టుండి వెక్ వెక్‌మని వెక్కు తున్నాడు నాకు దుఃఖం గుక్కలనిండా ముంచుకొచ్చింది తెలివొచ్చాక వాణ్ణి బాది 'ఏమిట్రా నీకీ ఖర్మ' అని అడగాలనిపిం చింది వా డెవడో అయితే బాధపడేవాణ్ణి కాను నిన్న మొన్నటివరకూ మంచివాడు మా ఊరివాడు, మా వీధివాడు, నా యీడు వాడు.

"రేయ్ బోసూ" అన్నాను మెల్లగా

"ష్ ఎవరడి" అన్నాడు ముద్దగా

"నేనురా ఏమిటిది?"

"విషారించకు నారు పోషినవాడే బీరు పోష్తాడు" అన్నాడు

"ఏయ్ మిస్టర్స్ యు ఆర్ డిస్టర్బింగ్ మై బిజినెస్ తాగితే తాగండి. లేకపోతే పొండి" అన్నాడు మేనేజర్ మా వెనక నుంచి

నాకు ఒళ్ళు మండు కొచ్చింది అసలు కారణం వాడు పుచ్చుకోవలసింది వాడి కాలరు

"అసలు నువ్వే వాడిచేత తాగించింది" అన్నాను కోపంగా

"యిక్కడ బ్రాందీ అమ్ముతామయ్యా. పనిమాలి తాగించము"

"వాడి మొహం వాడింతకు ముందు మందు మొహం యెరగడు బ్రాందీ బుడ్డి మూత కూడా వాసన చూసి ఉండడు దీనికి కారణం నువ్వే ఉండు పోలీసుల్ని పిలిపించి "

మేనేజరు మధ్యలో పెద్దపెట్టున నవ్వ డము మొదలెట్టాడు అదయ్యాక, "యిది కాపు సారా దుకాణం కాదు పోలీసులకి పట్టివ్వడానికి యింటికెళ్ళి పాత పేపర్లు చదవ్వయ్యా ఈ వ్యవహారానికి లైసెన్సు ఉంది బోల్డు డబ్బులు పోసి కొను క్కొచ్చాం దాన్ని" అని గద్దించాడు

ఏ యాంగిల్‌లో చూసినా అతనిది తప్పుకాదనిపించింది ఆ తర్వాత మేనేజర్‌ని తిట్టేందుకు స్కోప్ కనిపించలేదు

తగ్గు స్వరంతో "చూడండి మేనేజర్ గారూ! మీకూ మాకూ తగువొద్దు వీడు చాలా బుద్ధిమంతుడు అలాంటివాడు ఇలా అయ్యాడంటే యెలాగో వుంది అసలు కథేమిటో దయచేసి చెప్పండి" అన్నాను.

"బావుంది పైటికి రండి చెబుతా" అని మమ్మల్ని పైటికి తీసుకెళ్ళాడు తను



కూర్చుని మా యిద్దర్నీ చెరో స్టూల్ మీద కూర్చోబెట్టి యిలా అన్నాడు:

"ఈ చిన్నవాడు మూడు గంటల క్రితం వంద రూపాయలనోటు పుచ్చుకుని చిల్లర కోసం వచ్చాడు. లేదు పొమ్మన్నాను. చాలా షాపులు తిరిగాను, చిల్లర అవసర మని బ్రతిమాలాడు. ఉన్న చిల్లరంతా నీ కిస్తే మేం వ్యాపారం చేసినట్టే. ఒక బుడ్డి కొంటే చిల్లర యిస్తాను అన్నాను. అతను పరిస్థితులకి లొంగిపోయి లోపలకి వచ్చాడు. మందు బిగించాడు. అదీ కథ."

యిది శుద్ధ అబద్ధం. తాగుబోతు కథలా ఉంది.

"అయితే మిగతా చిల్లర బోసుబాబుకి భద్రంగా యిచ్చారా?" అని అడిగాను.

మేనేజర్ ఎగిరిపడి నవ్వాడు. "చిల్లరా! ఇక ఒకటే చిల్లర. మందులో పడి వంద నోటు మిగుల్చుకున్నవా డెవడూ లేడు" అని ఒకటే నవ్వడం సాగించాడు.

నాకు చిరాకు వేసింది. కానీ అంత మంచి బోసుబాబు డోసుబాబు యెలా అయ్యాడో బోధపడలేదు.

"మాస్టారూ, మీరు తవుడు కొనక్కర్లేదుగానీ పది నోటిలా యివ్వండి, చిల్లర యిస్తాను" అన్నాడు షాపు యజమాని. నేను ఉలిక్కిపడ్డాను. నోట్లు అతని చేతి కిచ్చి తవుడు బస్తాల వంక నిస్సహాయంగా చూసాను.